# ఆమె

ఆ యింటికి వచ్చిన నాలుగురోజులకి కాని నాకు పట్టబోయే అదృష్టం అనుభవంలోకి రాలేదు. అప్పుడూ తెలిసేదే కాదు. ఆ కిటికీవల్ల కాకపోతే.

దేశానికి అయిదువందలమైళ్ళదూరంలో విసిరేసినట్టు రెండుశతాబ్దాలు బ్రతికివచ్చాక - మన మనుష్యులూ, మన భాషా తెలిసినచోటుకి వచ్చినందుకే సంతోషంతో ఉక్కిరిబిక్కిరవుతోంది మా ఆవిడ. కాని నాకు పెద్ద తేడా కనిపించలేదు. తెలుగు రూపాయికీ, పంజాబీ రూపాయికీ తేడాలేదు. ఇక్కడా యిల్లు అద్దెకి తీసుకోవాలి, బియ్యం కొనాలి, పాలు పోయించుకోవాలి, పనిమనిషి తప్పదు. కరెంటుబిల్లులూ, కర్రలకొట్లూ, కాఫీపొడి దుకాణం ఖాతాలూ-యివేవీ తప్పవు. పోతే, యిక్కడ మరో కొత్తయిబ్బంది కనిపించింది. మా ఆవిడా నేనూ ఎప్పుడన్నా ఘర్షణపడితే, పంజాబీవాళ్ళకి అర్థమయేదికాదు. ఇక్కడ చక్కగా పక్కవాళ్ళకి అర్థమవుతుంది. అంతేకాదు - తెలుగువాళ్ళ ఆచారంప్రకారం ఆడవాళ్ళు మరి నాలుగు యిళ్ళకు ప్రచారంచేసే ప్రమాదంవుంది. ఇవన్నీ మా ఆవిడకి క్రమశః అనుభవంలోకి వస్తాయని తెలుసు. అయినా బదిలీమాట వినగానే ఉధృతమయిన 'అల'లాగ ఆమెలో పొంగివచ్చిన ఉత్సాహాన్ని అణగద్రొక్కలేకపోయాను.

ఊరు ఏదయితేనేం? ఢిల్లీలో కుతుబ్ మీనారూ ఇటుకలూ సున్నంతోనే నిర్మించారు; ఈ వూళ్ళో నలభైరూపా

యల అద్దెకొంపా సున్నం యిటుకలతోనే నిర్మించారు. మొదటి నాలుగురోజులూ ఉన్న సామాన్లని కనిపించే నాలుగు మూలలకీ సర్దడంలో నిమగ్నమయిపోయింది మా ఆవిడ. నా రచనావ్యాసంగం కొనసాగడానికి కాస్తపాటి గాలీ, వెలుగూ వచ్చే చోటుకోసం వెదుక్కోడం ప్రారంభించాను నేను. అదిగో, అప్పుడు కనిపించింది-సరుగుడుచెక్కలతో పూర్తిగా విడకుండా మూసేసిన పడమటివేపు కిటికీ. అది తెరిస్తే మంచి గాలి వేసే యోగ్యతవుంది ఆ గదికి. కాని యిదివరకు ఉన్న వాళ్ళు ఎందుకనో తెరవలేదు. ఒక మధ్యాహ్నమంతా పూర్తిగా శ్రమపడి చివరికి దాన్ని సాధించాను. సరుగుడు చెక్కలు విడిపోయాయి. తలుపులు తెరుచుకున్నాయి ఆన కట్ట తెగిపోయిన ప్రవాహంలాగ తలుపుల్ని తోసుకుని వెలుగు ఆ గదిలోకి ప్రవహించింది. నల్లటిగోడలు క్షణమాత్రం తెల్ల బోయినట్టు వెలిగాయి. బూజులు గాజుతోరణాల్లాగ కనిపించాయి. ఇక నా ఆనందానికి మేరలేదు-వీటన్నిటిమధ్యా సహజీవనం సాధ్యమయినందుకు కాదు, ఇవన్నీవున్నా చక్కని గాలీ వెలుతురూ సంప్రాప్తమయినందుకు.

ఆ కిటికీదగ్గర కుర్చీ వేసుకొని తనివితీరా గాలిని ఊపిరితిత్తులనిండా నింపుకొన్నాను. అప్పుడప్పుడు కింద మురుగుకాలవరుచి తెలిస్తేనేంగాక?-ఆ వెలుగు నేనూహించలేనిది. రెండు కార్లు అటునుంచి వెళ్ళాయి - వాటివెనక రోడ్డంతా బెదిరిపోయిన మనస్సులాగ కలవరపడింది. ఆ దుమ్ము మా కిటికీవరకూ వచ్చింది. కాని మా కిటికీని పరిరక్షిస్తున్నట్టు ఓ బొగడచెట్టు నీడుంది. మంచివారిమీదా, చెడ్డ

వారిమీదా వర్షించే భగవంతుడి కరుణలాగ - కింద మురుగు కాలవమీదా, దుమ్మురోడ్డుమీదా దాని పువ్వులు పరుచు కున్నాయి. చెడు లేకపోతే మంచికి విలువ ఏముంది?

ఇవన్నీ చూస్తూ హఠాత్తుగా తలెత్తాను. అప్పుడు-నిజంగా అప్పుడే-నాకు పట్టిన అదృష్టం కనులముందు గట్టింది.

అప్పుడే నాకు ఆమె దర్శనమిచ్చింది.

ఆ వీధివెంబడి చాలామంది కాలేజీ అమ్మాయిలు నడిచి పోతున్నారు. వీధిచివరన కాలవనీళ్ళకు చాలామంది ప్రౌఢలు మట్టికుండల్నీ, యౌవనభారాన్నీ మోసుకొని ప్రయాణం సాగిస్తున్నారు. వీధి వీధంతా బొగడచెట్టులాగే విరిసిన సుమ ధామంలాగ కనిపిస్తోంది. కాని యిందరిమధ్యా, యిన్నిటి మధ్యా ఒక్క- ఆమే నన్ను ఆకర్షించింది.

దిగ్భ్రాంతుడి నయ్యాను. ఆ సౌందర్యపు పలకరింతకి కళ్లు తిరిగాయి-ఆ గుప్తసౌందర్యాన్ని అచేతనంగా చూస్తూ కూర్చుండిపోయాను. అలా ఎన్నిక్షణాలో, ఎన్నియుగాలో గుర్తులేదు. క్రమంగా ఆమె కనుమరుగయింది-కలలోంచి జారి పోయినట్టు మాయమయింది.

ఆ జ్ఞాపకంలో రాత్రంతా తల్లడిల్లిపోయాను. కంటి మీద నిద్రలేదు. కొందరి సౌందర్యం ఉన్మత్తుడిని చేస్తే, కొందరి సౌందర్యం పరవశుణ్ని చేసి బుజ్జగిస్తుంది. లాలించి జోలపాడుతుంది. దిగ్భ్రమతో, తన్మయత్వంతో, అచేతనుణ్ని చేస్తుంది; అలరిస్తుంది. అటువంటి సౌందర్యం ఆమెది.

మత్నాడంతా అదేదృష్టి. అదే ఆలోచన. ఆ సమ యానికే వస్తుంది గావును - ఎదురుచూస్తూ కుర్చీలో కూర్చు

న్నాను. సాయంకాలమయేసరికి మా వీధంతా అందమయిన అమ్మాయిలతో అలంకరించుకొంటోంది. కాని ఒక్క ఆమె కోసమే కళ్ళలో వత్తులు వేసుకు ఎదురుచూస్తున్నాను. ఇంతలో-ఇంతలో, అవును-ఆమె కనిపించింది.

నిరీక్షణలోనూ ఆనందం ఉన్నదనుకొంటాను. ఆమెని చూస్తూ నిశ్చేష్టుడనయాను. తారుణ్యపు తొలిఛాయలు ఆమె చెక్కిళ్ళమీద కనిపించాయి. ఎర్రటి కెంపులాంటి చీరె. ఆకాశానికి ఎగసిన అగ్నిశిఖలాగ వుంది. తననిచూసే కళ్ళని గమనిస్తూ ఆమెమనస్సు కుంచుకపోతుందేమో! మరీ జాగ్రత్తగా పరికిస్తే ముఖంలో ఎరుపు పల్చనవుతోంది. రంగు మారుతోంది. ఎంతటి సుప్తసౌందర్యం అది!

మొదటి రెండు మూడు రోజులూ గుర్తించలేదు మా ఆవిడ. కాని రాను రాను నా ఏకాగ్రతనూ, దృష్టినీ పసిగట్టింది. ఆ సమయానికి ఆ కుర్చీలో చేరాలనే నా తపన ఆమె మనస్సుకి శూలంపోటులా వుండివుంటుంది. చెప్పని, చెప్పలేని బాధ అది. తనని మరచి, నా మనస్సుని ఎవరో ఆకర్షించుకొంటున్నారని చింత. అయినా యిది చాలాకాలం నేను గుర్తించలేకపోయాను.

"ఎందుకండీ అక్కడే కూచుంటారు? చలిగాలికి ఆరోగ్యం చెడుతుంది." అని నెపం పెట్టింది ఒకటి రెండుసార్లు.

అయినా చలించలేదు. ఏదో సాకుచెప్పి తప్పించుకొన్నాను.

రానురానూ ఆమెను చూడడం వ్యసనమయింది నాకు. ఆరాధన అంటే యిదేగావును.

ఒకోక్క రోజు ఆమె కనిపించేదికాదు. ఆ రోజు ఆకాశం మబ్బుపట్టేది. త్వరగా చీకటి వ్యాపించేది - ప్రపంచాన్నీ, నా మనస్సునీ.

కాని మరునాడు మళ్ళీ - యౌవనం పొలిమేరల్లో తల వొంచుకు నడుస్తున్న తారుణ్యమూ ర్తిగా, ఎర్రని తాంబూలం చర్వణంలో తామసాన్ని కలిగించే పెదము తయిదువలాగ, ఒకసారి చిరునవ్వుతో, ఒకసారి ఎర్రటి కోపంతో, ఒకోక్కసారి చెప్పరాని దిగులుతో కుంచుకపోయినట్టూ కనిపించేది.

ఆమెనిచూస్తూ-జీవితంలోని అపూర్వమయిన ఆశల్ని ఒకసారి ఊహించుకోగలిగితే, అనూహ్యమయిన బాధాతోర ణాల్ని ఒకసారి ఊహించుకొనేవాడిని. అలాంటి సందర్భా లలో ఆమెముఖం దిగాలుపడివుండేది. ఆ దిగులుచూసి గుండెల్లో కత్తిదించుకోవా లన్నంత దుఃఖం కలిగేది. చేత నయితే ఆమె దుఃఖం తీర్చలేనా అనిపించేది. ఆమె కష్టాల్ని ఊహించుకొంటూ అలాగే కిటికీదగ్గర తపస్సుచేసేవాడిని. ఆ సందర్భములో కళ్లు అశ్రుసిక్తాలయేవి. మా ఆవిడ ఎప్పుడో నన్ను తట్టిలేపి, నా కన్నీరుచూసి దిగ్భ్రాంతి చెందేది. అప్ప టికి చీకటిపడి, ఆమె ఎప్పుడో నా కళ్ళముందునుంచి జారి పోయేది.

రోజులు గడిచిపోతున్నాయి. ఆమె ఆలోచనలతో నా జీవనధోరణిలో కొత్తఉత్సాహం, ఆశా పుంజుకొంది. ప్రతీ ఉదయం కొత్తరుచులను చూపుతూ మేలుకొలిపేటట్టు భావించేవాడిని. దర్శనమాత్రంలో జీవన సరళినే ప్రభావితం

చేయగల ఈ సౌందర్యమూర్తి ఇంకా ముందుగానే నా జీవితంలోకి ఎందుకు ప్రవేశించలేదా అని అనుకొనేవాడిని.

ఆమెతో ఎందుకు మాట్లాడకూడదు? - 'కూడదు, అసలు ఆ అవసరంలేదు' అనుకొన్నాను. మాటలకి అతీతమయిన భాష మమ్మల్నిద్దరినీ ఒకటిచేసింది. ఆ భాషకి అతీతమయినది ఏదీ ఇక మా నాలుకలు ఉచ్ఛరించలేవు.

కాని క్రమంగా మా ఆవిడ దిగులుపడడం, నిర్జీవంగా మారడం గమనించాను. చెక్కిళ్ళు తెల్లబడ్డాయి. నేను చేసే పలకరింతలో ఆవిడకి నమ్మకం పోయినది. నా ప్రతిపనినీ అనుమానంతో పరీక్షించసాగింది. నా మాటల్ని ఇదివరకులాగ నమ్మడంలేదు. నా సాహిత్యాభిలాష ఒక దొంగపనికి ఆసరాగా చేసుకొన్న 'మిష' అనుకోవడం గమనించాను. పద్యం రాయాలని కలంపడితే_ఎప్పుడూ లేనిది-వెక్కిరించడం ప్రారంభించింది. ఇక సాయంకాలమయితే పిచ్చిపట్టినట్టు సాధింపులూ, ఆకారణంగా ఏడుపులూ ప్రారంభించింది.

ఆ అమృతమూర్తికయి నిరీక్షణా మాధుర్యాన్ని ఈమె వమ్ముచేస్తున్నట్టు అనుకొనేవాడిని. మా యిద్దరి ఏకాంతాన్ని ఎవరికీ తెలియనివ్వకూడదనుకొనే నా అభీష్టం నిలిచేలాగలేదు.

ఆనాటి సాయంకాలం ప్రత్యేకమయిన అలంకరణలతో ప్రత్యక్షమయింది ఆమె. అప్రత్యాశితమయిన సౌందర్య సందర్శనానందంలో లీనమయిన నాకు, మా ఆవిడ దుఃఖం అంకుశప్రాయమయి, నిజప్రపంచంలోకి వచ్చాను. ఆమె ఎక్కువసేపు నాకు కనిపించదని తెలుసు. ఆ మూగసంభాషణాలు యింకెంతోకాలం సాగవనీ తెలుసు. అయినా మా ఆవిడని

దాటిపోయేదెలా?–విసుగేసింది, దుఃఖంవచ్చింది. చటుక్కున లేచి మా ఆవిడ ముందుకి వచ్చాను. "ఏమిటి నీబాధ?" అని అడిగాను. చెప్పదు. పైగా నన్నుచూసి మరింత భోరుమంది. ఆ క్షణంలో ఆమెనుచూసి నా గుండె నీరయింది. కరచరణాలు ఆడలేదు. ఇక నా ఏకాంతము, నా రహస్యం ఎంతో కాలం దాగదని గ్రహించాను. ఇక నిస్సహాయుడనయాను. మా ఆవిడ భుజంపట్టుకొని కిటికీదగ్గరికి తీసుకొచ్చాను.

"మీ రెవరినో చూస్తున్నారు. మీ యిద్దరిమధ్యా ఈ రాయబారాల్ని గమనిస్తూనే వున్నాను. నేను చచ్చినా ఆమెముఖం చూడను–చూడనుగాక చూడను," అని కేకలు వేస్తోంది మా ఆవిడ ... వెంటనే నోరుమూశాను. తలెత్తి ఆమెను చూపించాను. అంతే. చూస్తూనే మా ఆవిడ నిర్ఘాంతపోయింది. ఆ కళ్ళలో విస్మయం, ఆశ్చర్యం ఏమని చెప్పను?–అయినా నమ్మకం చాలనట్టుంది – లేదా నేను మభ్యపెడుతున్నాననుకొందిగావును – "నన్ను మోసం చెయ్యబోకండి" అంది కాస్త ఆగి.

"లేదు లేదు," అన్నాను విశ్వాసంతో; "అటు చూడు. రోజూ నేను చూసేది ఆమెనే – ఆమె ఎవరనుకొన్నావు?"

"ఎవరు?" అంది అర్థంకాక.

"సంధ్య–ప్రతిరోజూ పడమటి ఆకాశాన్ని వెలిగించే పచ్చటి పెద్దముత్తయిదువ – సంధ్యాదేవి. ఆ పెదవులమీద

కెందామరలు చూడు. చెక్కిళ్ళలో ఎరుపు చూడు. ఆమె నిత్యయౌవని; ఆమె సౌందర్యానికి ఎవరూ మూర్ఛపోరు!"

నా ధోరణికి మా ఆవిడ ఒక్కటే నవ్వు.

ఇంతలో దీపాలు వెలిగించారు.

సంధ్యముఖం జేగురవుతోంది.

మా ఆవిడ మంగళసూత్రం కళ్ళకద్దుకొని తృప్తిగా నా కళ్ళలోకి చూసి లోపలికి వెళ్ళిపోయింది - సంధ్యనీ నన్నూ ఏకాంతములో వదిలేసి.

(యువ 1968, మే.)